రోడ్డు నిర్మాణంలో రాజకీయం

- వీధిలో ఒకవైపే సీసీ రోడ్డు నిర్మాణం
- డ్రైనేజీలకు స్థలం వదలకుండా ఇళ్లకు ఆనుకొని రోడ్డు వేసిన వైనం
- తమ అవసరాలకు ఇళ్ల ముందు స్థలం వదిలేలా చూసుకున్న టీడీపీ నాయకులు
- ఆందోళన చెందుతున్న కాలనీ వాసులు



బీసీ కాలనీలో ఒక వైపే వేసిన సీసీ రోడ్డు

కోసిగి: రోడ్ల నిర్మాణంలో కూటమి నాయకులు అధికార దర్పం చూపుతున్నారు. తమను అడివారెవరంటూ వీధిలో ఒకవైపు ఇళ్లకు ఆనుకొని, డ్రైనేజీలకు స్థలం వలదలకుండా రోడ్డు వేయించారు. మరో వైపు తమ ఇళ్ల అవసరాల కోసం ఖాళీ స్థలం వదిలే లా చేశారు. ఇష్టరాజ్యంగా రోడ్డు నిర్మాణం చేపట్టడంతో



ఇళ్లను ఆనుకుని రోడ్డు వేశారంటు చూపుతున్న బీసీ కాలనీవాసులు

కాలనీవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

మధ్యలో కాకుండా ఒకవైపే రోడ్డు..

కోసిగి మండలం సాతనూరు గ్రామంలో బీసీ కాలనీలో ఎస్ఆర్ఈజీఎస్ కింద 3 మీటర్ల వెడల్పు, 160 మీటర్లు పొడువు రోడ్డు వేసేందుకు రూ. 6లక్షలు నిధులు మంజూరయ్యాయి. అయితే ఆ కాలనీలో రోడ్డు వెడల్పు 6 మీటర్లు వరకు ఉంటుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిజైన్‌లో రోడ్డుకు ఇరువైపులు డ్రైనేజీలకు స్థలం కేటాయించి రోడ్డు మధ్యలో 3 మీటర్లు రోడ్డును వేయాల్సి ఉంది. అయితే అధికారుల నిర్లక్ష్యం, స్థానిక అధికార పార్టీ నాయకులు దర్పంతో డ్రైనేజీ కాల్వకు స్థలం కేటాయించకుండా ఒక వైపు నుంచి ఇళ్లకు ఆనుకుని రోడ్డు వేసి, మరో వైపు తమ అవసరాలకు వాడుకోవచ్చనే ఉద్దేశంతో ఖాళీ స్థలాన్ని వదిలేశారు. దీంతో తమ ఇళ్లకు ఆనుకొని రోడ్డు వేస్తే మురుగునీరు, వర్షపు నీరు ఎలా వెళ్లాలని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా గట్టిగా ప్రశ్నిస్తే టీడీపీ నాయకులు బెదిపింపులకు దిగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పనులకు వెళ్లిన సమయంలో రోడ్డు వేశారు

ఒక వైపు ఇంటి వరకు రోడ్డు వేయడంపై కాలనీకి చెందిన ఉలిగప్ప, ఖాసీంబీ, మల్లేష్, చాందు, ఉసేని, ఈరన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దౌర్జన్యంగా మేము పనులకు వెళ్లిన సమయంలో ఇలా రోడ్డు వేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా ఇళ్ల వరకు రోడ్డు వేస్తే డ్రైనేజీ నీళ్లు, వర్షపు ఎలా వెళ్లాలంటూ ప్రశ్నిస్తున్నారు. అడిగితే ఎవరితోనైనా చెప్పుకోండంటూ బెదిరిస్తున్నారని, భయాందోళన వ్యక్తం చేశారు. రోడ్డు వల్ల కాలనీ వాసుల మధ్య ఘర్షణలు జరిగే అవకాశం ఉందని వాపోయారు.

త్వరలో మరోపక్క రోడ్డు వేయిస్తాం..

రోడ్డు వెడెల్పుగా ఉండడంతో ఒక వైపు నుంచి 3 మీటర్లు రోడ్డు వేయాల్సి వచ్చింది. రోడ్డు వేసిన ప్రాంతంలో డ్రైనేజీ కాల్వ వేసేందుకు స్థలం ఉంది. ఆందోళన చెందాల్సి అవసరం లేదు. త్వరలో ఉన్నత అధికారులు, నాయకులతో మాట్లాడి మండల గ్రాంటు కేటాయించి మరో వైపు రోడ్డు వేయించి, ఇరుపక్కల డ్రైనేజీలు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం .

– సయ్యద్ అబ్దుల్ మాలిక్, పంచాయతీ రాజ్, ఏఈ

గడ్డివాముల దగ్ధం

కౌతాళం: మండల పరిధిలోని సుళేకేరి గ్రామంలో గడ్డివాము దగ్ధమై సుమారు రూ.70వేల ఆస్తి నష్టం జరిగింది. సాలిచంద్ర అనే రైతు వారం క్రితం కర్ణాటక నుంచి 70వేల రూపాయలు పెట్టి పశువుల కోసం వరిగడ్డిని తీసుకొచ్చాడు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గడ్డికి నిప్పు పెట్టడడంతో గడ్డి పూర్తిగా కాలిపోయిందని రైతు వాపోయాడు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరాడు.

నందవరం : మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో గడ్డివామి దగ్ధమైంది. సోమవారం బాధిత రైతు కనకగారి చిన్న పెద్దయ్య మాట్లాడుతూ.. మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి గడ్డివాముకు నిప్పు పెట్టారన్నారని వాపోయాడు. 5 ట్రాక్టర్ల గడ్డిని కొని వాము వేసుకున్నామని తెలిపారు. రైతులు, స్థానికులు మంటలు అదుపు చేయడానికి ప్రయత్నించినా వీలుకాలేదు, సామాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది గోపాల్, మహబుబ్ బాషా, చిన్నరాముడు మంటలను ఆర్పివేశారు. ఈ లోపే గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ.70 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

సర్కారీ విద్య బలోపేతానికి పోరాటం

ఎమ్మిగనూరుటౌన్: సర్కారీ విద్యను బలోపేతం చేసుకునేందుకు ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రభుత్వంతో పోరాటం చేసేందుకు విద్యార్థి లోకం సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, రాష్ట్ర మాజీ నాయకులు రామన్న, జిల్లా కార్యదర్శి అబ్దుల్లా పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో ఆ సంఘ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అమర్, విజయ్‌కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంగాధరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



గంగాధరేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పూజారి

ఆదోని అర్బన్: పట్టణంలో వెలసిన గంగాభవానీ దేవాలయంలో కొలువుదీరిన గంగాధరేశ్వర స్వామికి అమావాస్య పూజలు నిర్వహించారు. సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో గంగాధరేశ్వరస్వామికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, తదితర అభిషేకాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. దేవాలయ పూజారులు సత్యనారాయణస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గంగపుత్ర సంఘం నాయకులు తెలుగు ఈరన్న, ఆటో వెంకటేష్, వీరేష్, దుల్లయ్య, కార్పెంటర్ ఈరన్న, కార్పెంటర్ నాగేంద్ర, దీపక్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

ఆదోని సెంట్రల్: అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ అధ్యాపకులుగా పదోన్నతులు కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆదోని, కౌతాళం మండలాల ముఖ్య నాయకుల సమావేశం ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు అధ్యక్షతన సోమవారం జరిగింది. వారు మాట్లాడుతూ జీఓ నంబర్.223ను రద్దు చేసి ఉపాధ్యాయ వృత్తిలో అనుభవం ఉన్న ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసుతో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో ఎలాంటి అనుభవం లేని నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు పదోన్నతులు ఇవ్వడం సరికాదన్నారు. ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గోపాల్, ఎస్టీయూ నాయకులు షేక్షావలి, అంజినేయ్య, ఈశ్వరయ్య, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం పోరాటం

ఆదోని సెంట్రల్: విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం నిరంతరం పోరాటం చేద్దామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ ప్రధాన కార్యదర్శి గౌస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని విశ్వనారాయణ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ 55వ అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండాను పట్టణ అధ్యక్షుడు సూరి ఆవిష్కరించారు. వారు విద్య, ఉపాధి రంగాల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలను చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, భరత్, యశ్వంత్, పవన్ చందు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

ఆదోని అర్బన్: కర్ణాటక రాష్ట్రం బెలగాం జిల్లా చిక్కురూ తాలూకా నాయంగ్ల గ్రామానికి చెందిన మాయప్ప వేపచెట్టుపై నుంచి కింద పడటంతో గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే అతడిని ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మాయప్ప జీవనాధారం కోసం ఆస్పరి మండలం పలుకూరబండ గ్రామంలో గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. గొర్రెల కోసం వేపచెట్టు ఎక్కి ఆకు కోస్తుండగా చెట్టుపై నుంచి కిందకు పడ్డాడు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న పురపాలక చైర్మన్ బి. శాంత

ఆదోని సెంట్రల్: గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని పురపాలక చైర్మన్ బి.శాంత, మండల విద్యాధికారులు రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాసులు అన్నారు. పురపాలక మైదానంలో సోమవారం ఉజ్వల మిత్ర మండలి ఆధ్వర్యంలో బాలబాలికలకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడలతో పాటు చదువులో కూడా రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో పురపాలక ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లికార్జున, నెహ్రూమెమోరియల్ హైస్కూల్ హెచ్ఎం అలిమ్ సిద్ధిఖీ, వ్యాయామ ఉపాధ్యాయులు సుధాకర్, వెంకటస్వామి, ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో అమావాస్య వేడుకలు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన దర్గాల్లో ఒకటైన మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో సోమవారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వేడుకలకు వివిధ ప్రాంతా నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలను నిర్వహించారు. సోమవారం అమావాస్య కావడంతో భక్తులు ఆదివారం సాయంత్రం నుంచే తరలివచ్చారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు.

ఉరుకుందలో లక్ష పుష్పార్చన పూజలు



స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయంలో సోమవారం అమావాస్యను పురస్కరించుకొని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆధ్వర్యంలో లక్షపుష్పార్చన పూజలు చేపట్టారు. అమావాస్య రోజు ఇలాంటి పూజలు చేపట్టడం వల్ల భక్తుల్లో భక్తి భావం పెరుగుతుందన్నారు.గత మూడు నెలల నుంచి అమావాస్యకు ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టినట్లు డీసీ తెలిపారు. పుష్పార్చన పూజల్లో పాల్గొనలనుకున్న భక్తులు తమ పేర్లను ముందుగానే దేవాలయ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

పోటెత్తిన భక్తులు

అమావాస్య సందర్భంగా భక్తులు తమ ఇంటి ఇలావేల్పును దర్శంచుకోవాడానికి వేలాదిగా తరలివచ్చారు. సోమవారం స్వామి వారంతో పాటు అమావాస్య కలిసి రావడంతో ఆదివారం సాయంత్రం నుంచే భక్తులు ఉరుకుందకు చేరుకున్నారు. దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహా మంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. అలాగే బుదుములదొడ్డి ఆంజినేయస్వామి ఆలయంలో , తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బసవేశ్వర స్వామికి విశేష పూజలు

కోసిగి: స్థానిక బసవన్న కొండపై వెలసిన శ్రీ బసవేశ్వర స్వామికి విశేష పూజలు చేపట్టారు. సోమవారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జామున నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజలు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి వారి దర్శనార్థం వచ్చిన భక్తాదులకు ఆలయ కమిటీ సమక్షంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పెద్దనేలటూర్‌లో ప్రత్యేక పూజలు

గోనెగండ్ల : మండల పరిధిలోని పెద్దనేలటూర్ గ్రామంలో నీలకంఠేశ్వర స్వామి లింగప్రతిష్ఠ కార్యక్రమం జరిగి 41 రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రోజున అమావాస్య కావడంతో దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహారుద్రాభిషేకం, మహా మంగళహారతి అమ్మవారికి ఆకుపూజ నిర్వహించారు. భక్తులకు అన్నదానం, రాత్రి భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

ఎమ్మిగనూరురూరల్: డిసెంబర్ 31 వేడుకలను ప్రజలు, యువత సంతోషంగా జరుపుకోవాలని, పోలీస్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఉపేంద్రబాబు హెచ్చరించారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముందుగా పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని అర్బన్, రూరల్, నందవరం, గోనెగండ్ల, మంత్రాలయం, కోసిగి, కౌతాళం మండలాల ప్రజలు, యువతకు ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే 31వ తేదీ యువకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లు బైక్‌లు నడిపితే దానికి బాధ్యులను తల్లిదండ్రలను చేయాల్సి వస్తుందన్నారు. సంతోషంగా వేడుకలు జరుపుకోవాలేగానీ మహిళలు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, అల్లర్లను సృష్టించాలని చూస్తే పోలీస్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రోడ్లపై కేక్‌లు కట్ చేయటం చేయరాదని చెప్పారు. మంగళవారం అర్ధరాత్రి 12 తరువాత ఎవరు పట్టణ వీధుల్లో కనిపిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఆదోని అర్బన్: 2025 నూతన సంవత్సరం వేడుకలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ సోమన్న సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం రాత్రి ఆదోని పట్టణం, రూరల్ ప్రాంతాల్లో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపితే వాహనాల చట్టం–185 ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మద్యం షాపులు ప్రభుత్వం అనుమతించిన సమయం వరకే తెరిచి ఉంచాలన్నారు.ద్విచక్రవాహనాల సైలెన్సర్లను తీసి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనాలు అధిక వేగంతో నడుపరాదని, ప్రజలు తిరిగేచోట బైక్ రేసింగ్ చేయరాదని సూచించారు. కొందరు వ్యక్తులు శుభాకాంక్షలు చెప్పే నెపంతో ఈవ్‌టీజింగ్, స్నాచింగ్ చేసేందుకు అవకాశం ఉండొచ్చని, మహిళలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా నూతన సంవత్సరం ఈవెంట్స్ నిర్వహించాలనుకుంటే ముందుగా తమ అనుమతి తీసుకోవాలని సూచించారు. డీజేలకు ఎలాంటి పర్మిషన్లు లేవన్నారు.

ఎస్సీ జాబితా నుంచి తొలగించాలి



తహసీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గోనెగండ్ల : ఎస్సీ కులగణన జాబితా నుంచి మాదాసి, మాదారి కురవలను తొలగించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు జి.ఆనంద్ చైతన్య, జిల్లా ఉపాధ్యక్షుడు మహాదేవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 26న గ్రామ, వార్డు సచివాలయాలలో ప్రదర్శించిన ఎస్సీ కులగణన జాబితాలో అనేక తప్పులు చోటుచేసుకున్నాయన్నారు. వీటిని సరిదిద్దేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బజారి, దుబ్బన్న, నల్లన్న, నరసింహులు, రాజ్ కుమార్, రంగస్వామి, సునిల్, నాగరాజు పాల్గొన్నారు.

ఎస్సీ కుల గణన నుంచి తొలగించాలి

ఎమ్మిగనూరుటౌన్: మాదాసి కురవ, మాదారి కురవలను ఎస్సీ కులగణన జాబితా నుంచి తొలగించాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు ఆనంద్ చైతన్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు స్వామిదాసు, శాంతిరాజు, గుండప్ప, ప్రకాశం, ముక్కరన్న, రాముడు, జయరాజ్ పాల్గొన్నారు.

ఎస్సీ కులాలకు అన్యాయం

పెద్దకడబూరు : మాదాసి, మాదారి కురువ కులాల పేరుతో ఎస్సీ కులాలకు అన్యాయం జరుగుతుందని మాల మహానాడు రాష్ట్ర ప్రధానకార్యదర్శి నరసప్ప ఆవేదన వ్యక్తం చేశారు. మాదాసి, మాదారి కురువలను ఎస్సీ కులగణన జాబితా నుంచి తొలగించాలని సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శ్రీనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. మాల మహానాడు లీగల్ అడ్వైజర్ చంద్రయ్య, మీసేవ ఆంజనేయ, మునెప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లకు వెయింటింగ్ హాల్ ఏర్పాటు చేయాలి



మున్సిపల్ కమిషనర్‌తో చర్చిస్తున్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

ఆదోని టౌన్: వివిధ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సమాధానాలు చెప్పడం, అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు గానూ కౌన్సిలర్లకు వెయిటింగ్‌హాల్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు ఫయాజ్, రాజేశ్వర్‌రెడ్డి, వెంకటేష్ మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణను కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో చర్చించారు. ప్రత్యేక గది లేకపోవడంతో వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామన్నారు. పరిష్కారం కోసం కార్యాలయం చుట్టూ కాళ్ల అరిగేలా తిరిగే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, పాలకవర్గ సభ్యులు ఎవరు చేసినా ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనన్న వాస్తవాన్ని గమనించాలన్నారు.

మా మొరను ఆలకించండి

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం గుడ్ విల్ పేరుతో లక్షలాది రూపాయలు అప్పులు చేసి కట్టామని, అయితే కాంప్లెక్స్ నిర్మాణం ఆగిపోవడంతో తాము తెచ్చుకున్న డబ్బులకు వడ్డీలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారులు సికిందర్, శంకర్‌రావు, బాషాలు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు విన్నవించారు. ఏడాది కావొస్తున్నా కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి కాలేదన్నారు. లక్షలాది రూపాయలకు వడ్డీలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కమిషనర్‌కు వివరించారు. తమ ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా కాంప్లెక్స్ నిర్మాణం పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి తమకు షాపులు కేటాయించాలని విన్నవించారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

గోనెగండ్ల : డిసెంబర్ 31 రాత్రి బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చేస్తామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 31 రాత్రి రోడ్డు మీద గుంపులుగా సమావేశం అవ్వడంగాని, తిరగడం గాని చేయరాదన్నారు. మద్యం సేవించి ఓవర్ స్పీడ్ రాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలతో పాటు వాహనంను సీజ్ చేస్తామని హెచ్చరించారు. రాత్రి 12 గంటల తరువాత రోడ్డుపై ఎవరూ కనిపించ రాదన్నారు. అలాగే బహిరంగా ప్రదేశాలలో న్యూ ఇయర్ సందర్భంగా రోడ్డు మీద కేక్ కటింగ్‌లు చేసుకొని అనవసరముగా గొడవలు పడడం, కొట్టుకోవడం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి

ఆదోని సెంట్రల్: విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి సూచించారు. సోమవారం పురపాలక ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ మెంబర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు స్కూళ్ల అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు పరిశుభ్రత తదితర అంశాలపై తరగతి గదులలోనే బోధించాలని సూచించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో శిక్షణ తీసుకొన్న రిసోర్స్ పర్సన్లు ప్రతి పాఠశాల స్థాయిలో కమిటీ మెంబర్లు, ఉపాధ్యాయులు కూడా శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 శ్రీనివాసులు, సీఎంఓ శివశంకర్, జిల్లా రిసోర్స్ పర్సన్ విజయ భాస్కర్, డివిజినల్ రిసోర్స్ పర్సన్లు సురేంద్ర బాపుజీ, బాలాజీరావు, గౌస్ ఖాసింబాషా తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను గడువులోపు పరిష్కరించాలి



సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరావు, వేణుసూర్య, డీఎల్‌పీఓ నూర్జహాన్, గృహ నిర్మాణశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, డిప్యూటీ డీఈఓ వెంకటరమణారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్‌రఫీ పాల్గొన్నారు.

నేషనల్ నర్సింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ఆదోని సెంట్రల్: విద్యార్థుల నుంచి అక్రమ ఫీజులు వసూలు చేస్తున్న నేషనల్ నర్సింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య పట్టణ కోశాధికారి శేఖర్ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా తరగతులను రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన ప్రాక్టికల్స్, ల్యాబ్స్ వంటివి చేయడానికి ఎలాంటి సదుపాయాలు లేవని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలి

పెద్దకడబూరు : విధులపై నిర్లక్ష్యం వహిస్తున్న హెచ్.మురవణి ప్రాథమిక(ఆదర్శ) పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరారెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిది, ఆర్‌యూఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ డిమాండ్ చేశారు. ఆదోనిలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ హెచ్ఎం పాఠశాలకు హాజరై అటెండెన్స్ వేసుకొని మండల కేంద్రంలోని ఎమ్మార్సీకి వెళ్లుతున్నానని చెప్పి తన వ్యక్తిగత పనులపై తిరుగుతూ విధులను గాలికి వదిలేశాడని ఆరోపించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పాఠశాలకు వెళ్లి ఆయనను కలసి ప్రశ్నించగా నాకు నియోజకవర్గ స్థాయిలో నాయకుల సపోర్ట్ ఉందని, ఇష్టం వచ్చినట్లు మాట్లాడాడని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి ఆయనపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యాయవాది మృతికి కారకులను శిక్షించాలి



ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబుకు వినతి పత్రం ఇస్తున్న న్యాయవాదులు

ఎమ్మిగనూరుటౌన్: అనంతపురం జిల్లా గాలివీడులో న్యాయవాది సుదర్శన్‌రెడ్డిపై దాడి, మరో న్యాయవాది వివి.శేషాద్రి మృతికి కారకులైన సీఐ, పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యంకె. గురురాజారావు, సీనియర్ న్యాయవాది లక్ష్మీనారాయణ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు నుంచి ర్యాలీగా వెళ్లి డీఎస్పీ ఉపేంద్రబాబు, తహసీల్దార్ శేషఫణిలకు వినతిపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. సివిల్ తగాదాల్లో పోలీసుల జోక్యం పెరిగిపోయిందని, దీంతో ఇలాంటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక న్యాయవాదులు రఘురాం, మురళీకృష్ణ, బాషా, సురేష్, జగన్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి



అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలియజేస్తున్న సీపీఐ ఎంఎల్ నాయకులు

ఆదోని రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం ఆదోనిలోని శ్రీనివాసభవన్ ముందు నిరసన తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన భారత పార్లమెంట్‌లో అంబేడ్కర్ పట్ల గౌరవం తగ్గించేలా కేంద్ర మంత్రి వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. అమిత్‌షా క్షమాపణలు చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి మణి, మహాదేవమ్మ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, కె.మల్లికార్జున, రవి తదితరులు పాల్గొన్నారు.